పంటలను రక్షించేదెలా..?

- చేతికొచ్చిన పంటలను ధ్వంసం చేస్తున్న అడవి పందులు
- రక్షణకు సోలార్, విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తున్న రైతులు
- కేసులు నమోదు చేస్తున్న అటవీ అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



చింతలమానెపల్లి శివారులో అడవి పందులు నాశనం చేసిన పత్తి పంట



బెజ్జూర్ శివారులో అడవిపందులు ధ్వంసం చేసిన వరిపైరు

దహెగాం/ఆసిఫాబాద్‌రూరల్: రైతులు ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటలకు అడవిపందుల బెడద తీవ్రంగా ఉంది. పత్తి, వరి, కంది పంటలకు పందులు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. పూత, కాతదశలో పంటలు ఉన్న సమయంలో అడవి పందులు గుంపులుగా వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయి. పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా ఇ బ్బందులు పడుతున్నారు. పంటల రక్షణకు వి ద్యు త్ తీగలు, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో పందులు మృతిచెందితే కేసులు పెట్టి రైతులను జైలుకు పంపుతున్నారు. కానీ అడవి పందుల నుంచి పంటలను కాపాడుకోవడానికి అటవీ అధికారులు ఎలాంటి అవగాహన కల్పించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వన్యప్రాణులను వేటాడితే ఎలాంటి కేసులు ఉంటాయో అవగాహన లేకపోవడంతో రైతులు జైలు పాలవుతున్నారు.

రక్షణ కోసం పాట్లు..

సాగు చేసిన పంటలను రక్షించుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అటవీ సమీప ప్రాంత పంట చేలల్లో అడవిపందుల బెడద తీవ్రంగా ఉందని రైతులు వాపోతున్నారు. పంట చేలను కాపాడుకోవడానికి చుట్టూ చీరలు, జాలీలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు రాత్రి వేళల్లో రైతులు పంట చేలల్లో కాపాలా ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేల చుట్టూ ఏర్పాటు చేసిన రక్షణ వలయాన్ని సైతం ధ్వంసం చేసి పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. పందులు గుంపులుగా వస్తుండడంతో ఎక్కడ దాడి చేస్తాయోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. పెంచికల్‌పేట్, దహెగాం, బెజ్జూర్ మండలాల్లో అడవిపందుల బెడద అధికంగా ఉంది.

పరిహారం మంజూరులో జాప్యం..

అడవి పందులు పంటలను నష్టపరిస్తే సకాలంలో రైతులకు పరిహారం అందడం లేదు. పరిహారం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ చాలా మంది రైతులు అవగాహన లేక దరఖాస్తు చేయడం లేదు. ప్రభుత్వం అందించే నష్టపరిహారంపై కూడా అధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

వన్యప్రాణులను వేటాడితే కేసులు..

వన్యప్రాణులను వేటాడితే కేసులు నమోదు చేస్తున్నారు. 1972 యాక్ట్ షెడ్యూల్ (2) పార్ట్ (ఏ) క్రమ సంఖ్య 23 లో అడవి పందిని చేర్చారు. దీంతో అడవి పందిని చంపినా, వేటాడినా కేసులు నమోదు చేస్తూ రిమాండ్‌కు తరలిస్తున్నారు. రైతులకు చట్టాల గురించి తెలియక పోవడంతో అమాయక రైతులు జైలుపాలవుతున్నారు. గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆసిఫాబాద్ మండలంలో..

ఆసిఫాబాద్ మండలంలోని ఈదులవాడ, చిర్రకుంట, బూర్గుడ, కొమ్ముగూడ, గొల్లగూడ, మోతుగూడ, చిలాటిగూడ, సింగరావుపేట్, అప్పపల్లి గ్రామాల్లో చేతికొచ్చిన వరి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. సంబంధిత అధికారులు సర్వే చేసి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

నమోదైన పలు కేసులు..

- గత నెల 29న సిర్పూర్(టి) మండలం లక్ష్మీపూర్ అటవీ ప్రాంతంలో అడవి పందిని హతమార్చిన ఏడుగురిపై కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించారు.
- ఇటీవల సిర్పూర్(టి) బెంగాలీ క్యాంపునకు చెందిన ఏడుగురిని అటవీ అధికారులు చితకబాది వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, పోలీసులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆరోపిస్తూ దీక్ష చేపట్టారు.
- గత అక్టోబర్‌లో తిర్యాణి మండలం గంభీరావుపేట శివారులో పంటలను కాపాడుకోవడానికి రైతు పంట చుట్టూ విద్యుత్ తీగ అమర్చాడు. దీంతో అడవి పంది తీగలకు తగిలి మృతి చెందింది. మృతి చెందిన అటవి పందిని ఇద్దరు వ్యక్తులు తరలిస్తున్న క్రమంలో అటవీ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అవగాహన కల్పిస్తున్నాం

వన్యప్రాణులను వేటాడం నేరం. అడవులను, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కళాజాత రూపంలో వివరిస్తున్నాం. వన్యప్రాణులను వేటాడితే కేసులు నమోదు చేస్తాం. అడవి పందులు పంటలను నాశనం చేస్తే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలి. రైతులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలి. పంటలను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్నాం.

– సద్దాం, ఎఫ్ఎస్‌వో, దహెగాం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పూజలు

కౌటాల: మండలంలోని కన్నెపల్లి గ్రామంలో గల ఆంజనేయ స్వామి మందిరంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్తికమాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్తిక మాస కాకడ హారతి ఇచ్చారు. ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహించడంతో పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హారతీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

'బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి'



బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

కౌటాల: బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల కన్వీనర్ నాగపూరే బండు అన్నారు. ఆదివారం కౌటాల మండలం పార్డీ, తాటిపల్లి, భాలేపల్లి, సాండ్‌గాం గ్రామాల్లో భారత రాష్ట్ర సమితి గ్రామాల యూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ బలోపేతం కోసం పని చేయాలని తెలిపారు. బీఆర్ఎస్‌తోనే గ్రామీణ ప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని తెలిపారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి కార్తీక్, జాడి బాజీరావు, గోపాల్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు ప్రారంభం



చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న దేవయ్య

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని సిర్పూర్(టి) –మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో ఉన్న మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును ఆదివారం కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ కమిటీ సిబ్బంది వ్యవహరించాలన్నారు. మహారాష్ట్రలో పంటను విక్రయించేందుకు వెళ్లే రైతులు మార్కెట్ కమిటీ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ సెక్రెటరీ భాస్కర్, మాజీ జెడ్పీటీసీ అజ్మీరా రాంనాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి, మిస్బా, మార్కెట్ కమిటీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ పంపిణీ



కిట్ అందజేస్తున్న ఎస్సై కొమురయ్య

పెంచికల్‌పేట్: మండలంలోని బొంబాయి గూడ గ్రామానికి చెందిన యువకులకు పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య ఆదివారం వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో శారీక ధృడత్వం పెంపొందుతుందన్నారు. యువత ఖాళీ సమయాల్లో చెడువైపు వెళ్లకుండా క్రీడలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

బేల: మండలంలోని బెదోడ గ్రామంలో గల వృద్ధాశ్రమంలో ఏవన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ సీనియర్ అడ్వైజర్ పెంటపర్తి ప్రభాకర్ మాట్లాడుతూ చలికాలం దృష్ట్యా వృద్ధాశ్రమంలోని వృద్ధులు చలిని తట్టుకునేలా దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పోచన్న, మేకల జితేందర్, మెస్రం శంకర్, ఉప్పల్‌వార్ కార్తీక్, షేక్ అహమ్మద్, అద్దెకి సునీల్, కలగంటి భూమన్న, కలగంటి వెంకటేశ్, దుర్ల అడెల్లు పాల్గొన్నారు.

ఖత్రీ సమాజ్ భవనం ప్రారంభం

కై లాస్‌నగర్: మావల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఖత్రీ సమాజ్ భవనాన్ని ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖత్రి సమాజ్ కులస్తుల కృషి, పట్టుదలతో ముందుకు సాగి లక్ష్యాన్ని చేరుకుంటారని కొనియాడారు. జనాభాలో అల్పసంఖ్యాకులుగా ఉన్నప్పటికీ అందరూ ఒకే బాటలో నడుస్తు ఆదర్శంగా నిలుస్తారన్నారు. వారికి తమ వంతుగా కృషి చేస్తామని, అండగా నిలుస్తామని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు, సమాజ్ కులస్తులు పాల్గొన్నారు.

సాంబశివ ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆసిఫాబాద్‌అర్బన్: పవిత్ర కార్తికమాసాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ సాంబశివ ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి తాటిపల్లి ప్రశాంత్ ఆధ్వర్యంలో అర్చకులు సుబ్బామహేశ్వర్మ ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మంగళహారతి, మహామంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, మధ్యాహ్నం 1 గంట నుంచి మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వండి



మాట్లాడుతున్న పోకల నాగయ్య

ఆసిఫాబాద్‌అర్బన్: త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని తెలంగాణ లెక్చరర్ ఫోరం రాష్ట్ర కన్వీనర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పోకల నాగయ్య కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టభద్రులు ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలపై, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై గత 18 సంవత్సరాలుగా నిరంతరం పోరాటాలు చేస్తున్నానన్నారు. విద్యావంతులు ఆలోచించి పని చేసే అభ్యర్థికే మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్, జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, కిరణ్, హైమద్, ఆహట్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో భక్తుల పూజలు



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని భక్తులతో పాటు పక్క జిల్లా గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు అందించి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారి సన్నిధిలో తలనీలాలు, కర్ణవేదన కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు తీర్థప్రసాదాలు అందించి అన్నవితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.



మహంకాళి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం



పూజలు నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

బెజ్జూర్: అందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఆదివాసీ కొలవార్ జిల్లా యువజన సంఘం కన్వీనర్ మేడి సతీశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్స పోచయ్య, జాతీయ అధ్యక్షుడు సుంకే కిష్టయ్యలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివాసీలందరు ఐక్యంగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఆవిర్భావ దినోత్సవాలు మరెన్నో జరుపుకోవాలని, సమాజంలో ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం ఉన్నతమైన గుర్తింపు పొందాలని పేర్కొన్నారు. బెజ్జూర్ మండల గౌరవ అధ్యక్షుడు ఆత్రం బక్కయ్య, అధ్యక్షుడు పెద్దల సంతోష్, ఉపాధ్యక్షుడు మనెపల్లి మల్లేశ్, మండల యువజన సంఘం అధ్యక్షుడు మానేపల్లి వెంకటేశ్, మండల మహిళా అధ్యక్షురాలు ఇట్యాల లలిత, మండల నాయకులు పెద్దల నాగేశ్, బుర్రి మధు, మేకల గొంతు, గొర్రెపల్లి సాంబయ్య, చింతపూడి గణపతి, మానేపల్లి సతీశ్, ఎడ్ల రమేశ్, కుర్మ నాగేశ్, పెద్దల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే

లింగాపూర్: మండలకేంద్రంతో పాటు మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో సమగ్ర సర్వే కొనసాగుతోంది. 24 మంది ఎన్యూమరేటర్లు ఆదివారం ఇంటింటికి వెళ్లి కుటుంబ సర్వే ప్రక్రియ నిర్వహించారు. కుటుంబ యజమానుల నుంచి వివరాలు సేకరించి సర్వే ప్రశాంతంగా నిర్వహించారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో ఆదివారం రెండో రోజు సమగ్ర కుటుంబ, కుల గణన సర్వే కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సర్వేను చేపట్టి వివరాలు సేకరించారు. సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న సర్వేను ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

అన్ని కాలమ్స్ పూరించాలి

కెరమెరి: సమగ్ర కుటుంబ సర్వే ప్రొఫార్మలో ఉన్న అన్ని కాలమ్స్‌ను ఎన్యూమరేటర్లు విధిగా పూరించాలని జిల్లా పరిషత్ సీఈవో, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని కొఠారి, రింగన్‌ఘాట్, ధనోరా, సాకడ, కెరమెరి గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. ఎన్యూరేటర్లకు ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఏవైనా ఇబ్బందులా ఉన్నాయా? అంటూ అడిగి తెలుసుకున్నారు. ఆధార కార్డు నంబర్లు, రేషన్‌కార్డు నంబరు, పట్టా వివరాలు తదితరాలు తప్పక పూరించాలని పేర్కొన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే సూపర్‌వైజర్లు అందుబాటులో ఉంటారన్నారు. ఆయన వెంట ఎంపీడీవో అంజద్ పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు ఉన్నారు.



సిర్పూర్ (టి): కుల గణన సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ



లింగాపూర్: కిమానాయక్‌తండాలో..



కెరమెరి: సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

దాజీశంకర్ ఆశయ సాధనకు కృషి

తాంసి: కామ్రేడ్ దాజీశంకర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, ఆదిలాబాద్ మొదటి ఎమ్మెల్యే దాజీశంకర్ 38వ వర్ధంతిని సావర్గాంలో ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా దాజీశంకర్ స్మారక స్తూపం వద్ద పార్టీ జెండాను నాయకులతో కలిసి ఎగురవేశారు. ఆయన స్తూపం వద్ద పూలమాలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు చేశారని గుర్తుచేశారు. నాయకులు విలాస్, సట్వాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ తీరుతో మాదిగలకు అన్యాయం'

కైలాస్‌నగర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడంలో రాష్ట్రం ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష వైఖరి కారణంగా మాదిగలకు తీరని అన్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మల్లేశ్ ఆరోపించారు. ఆదివారం అదిలాబాద్ రూరల్ మండలంలోని పాచ్చెర గ్రామంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ నిర్వాకంతో మాదిగ జాతి బిడ్డలకు విద్య, ఉద్యోగరంగాల్లో నష్టం జరుగుతుందన్నారు. మాదిగ ఉప కులాలన్ని ఏకతాటిపైకి వచ్చి ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడదారపు భూమన్న, ప్రధాన కార్యదర్శిగా అలాల్ శ్రీకాంత్, ఉపాధ్యాక్షుడిగా ముక్కల నగేశ్, కార్యదర్శులుగా అగ్గిమల్ల రాకేశ్, ప్రచార కార్యదర్శిగా కడదారపు అశోక్, సభ్యులుగా పెద్దింటి శ్రీనివాస్, అలాల్ అశోక్, పెంటపర్తి అశోక్, ప్రవీణ్, వసంత్, జస్వంత్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన గ్రామ కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

చీరలతో రక్షణ

కెరమెరి: మండలంలోని పత్తి పంటలతో పాటు కంది, ఇతర పంటల రక్షణకు చీరలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం మండలంలోని ఏ పొలాన్ని చూసిన చుట్టూ చీరలు కట్టి ఉన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. పందులు, కోతుల బెడద నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు ఇలా చీరలు కడుతున్నారు.

